



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

అవగాహన లేకుంటే.. ఖాతా ఖాళీ..!



- పెరుగుతున్న సైబర్ నేరాలు - అప్రమత్తతే కీలకమంటున్న పోలీసులు

సైబర్ నేరగాళ్లు రోజు రోజు పేట్రేగిపోతున్నారు. వారి నుండి వచ్చే లింకులను ఏ మాత్రం ఆదమరిచి క్లిక్ చేసినా వెంటనే బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. అలాగే మరికొన్ని విషయాల్లో అవగాహన లేకపోయినా బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోతుంది. సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో వల వేస్తున్నారు. అలాంటి సమయంలో అప్రమత్తతే కీలకమని అధికారులు సూచిస్తున్నారు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సైబర్ నేరాలు సమాజంలో వేగంగా విస్తరిస్తూ విపత్తుగా మారాయి. సాంకేతికత అభివృద్ధితో పాటు, సైబర్ నేరగాళ్లు కూడా తమ నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. డేటా దొంగిలించడం, మోసపూరిత ఫోన్ కాల్స్, ఇమెయిల్ మోసాలు, సోషల్ మీడియాలో మోసాలు, బ్యాంకింగ్ డేటా దొంగిలించడం, ఆన్లైన్ షాపింగ్ మోసాలు, ఫేక్ సైట్లు, సోషల్ మీడియాలో భయపెట్టే సందేశాలు పంపడం వంటి నేరాలు చాలా మందిని వలలో వేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఓటిపిలను చెప్పడం, అవగాహన లేకుండా క్లిక్ చేసే లింక్స్, మీ వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వంటి చర్యలు సైబర్ నేరగాళ్లకు సహకరిస్తాయి. అందువల్ల ప్రజలు తమ డేటాను సురక్షితంగా ఉంచుకోవడం, మోసపూరిత మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వకుండా ఉండడం, ఆన్లైన్ లావాదేవీల్లో జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. ఇతర క్రైమ్‌లతో పోలిస్తే సైబర్ క్రైమ్ నేరాలు ప్రతి ఏటా 12 శాతం పెరుగుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2022 నుంచి 2024 అక్టోబర్ వరకూ 175 సైబర్ కేసులు నమోదయ్యాయి. సుమారు రూ.16.95 కోట్ల సొమ్మును బాధితులు పోగొట్టుకున్నారు. తక్కువ డబ్బుకు ఎక్కువ మొత్తం వస్తుందనే ఆశ చూపి డబ్బులు కడితే ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసి పలు దఫాలుగా ఎక్కువ నగదు తీసుకోవడం, పార్ట్ టైం ఉద్యోగాలు ఇప్పిస్తామని వాట్సప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు పంపించడం, ఇలా చాలా రకాలుగా సైబర్ మోసాలకు లోనవు తున్నారు. బ్యాంకు లావాదేవీలపై నేరాలు, స్కాన్ ఉపయోగించి లావాదేవీలు ద్వారా కూడా మోసాలు జరుగు తున్నాయి. టెలిగ్రామ్ మెసేజింగ్, వాట్సాప్ మెసేజింగ్, వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లు, పేమెంట్ గేట్‌వేలు, కంపెనీలు, బ్యాంక్ ఖాతాలు, క్రిప్టోకరెన్సీ మొద లైనవి ఉపయోగిస్తున్నారు. ప్రలోభ పెట్టే లింక్‌లు ట్విట్టర్ ఎకౌంటులకు పంపడం, ఆ లింక్ ద్వారా వాట్సాప్ బిజినెస్ అకౌంటులో జాయిన్ అయి తద్వారా బెట్టింగ్‌కు సంబంధించి యాప్లలో జాయిన్ అయ్యి, మోస పూరితమైన మాటలతో డిజిటల్ రూపంలో డబ్బు ఆ వ్యక్తి ఖాతాలో జమ అవుతున్నట్లు నమ్మకం కల్గిస్తూ ఆ యాప్‌లో గెలిచిన డబ్బులు ఉన్నట్టు చూపించి దాన్ని విత్ డ్రా చేసుకోవాలంటే కొంత డబ్బులు జమ చెయ్యాలని చెప్పి, అలా డబ్బులు వేసిన తర్వాత అది నిర్ణీత సమయంలోపు వెయ్యలేదని, దానికి ఫైన్ కట్టాలని మళ్లీ డబ్బులు వేయమని చెప్పి ఆశపెట్టి పలు సార్లు డబ్బులు వేయించుకొని ఇలా బాధితుడిని పలు మార్గాలలో ప్రలోభ పెట్టి లక్షల రూపాయల డబ్బును వివిధ రకాల పేమెంట్ విధానాలలో సైబర్ నేరగాడు తన ఖాతాలకు బదలాయించుకొని మోసానికి పాల్పడుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొంత మంది బాధితులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి ఇంటిలోనే ఉంటూ లక్షలు సంపాదించవచ్చునని నగదు పోగొట్టుకున్నారు. యువత బెట్టింగ్‌కి బానిస అయ్యి, డబ్బులు పోగొట్టుకొని చివరికి ఆత్మహత్య వరకు వెళ్తున్నారు. విద్యార్థులు, ఉన్నత చదువులు చదివి కూడా ఇలాంటి బెట్టింగ్ కు పాల్పడి పోలీస్ రికార్డులలో నమోదు కావడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడంతో పాటు, పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడితే వారిపైన పోలీసులు ఛార్జ్‌షీట్ ఓపెన్ చేస్తున్నారు. ఇటువంటి సామాజిక రుగ్మతలకు యువత దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, వారి అలవాట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

వ్యక్తిగత వివరాలు వెల్లడించొద్దు

ఒకే ఒక్క క్లిక్ మీ డేటాను అపహరిస్తుంది. ఇ-మెయిల్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియాలో వచ్చిన అనుమానాస్పద లింకును క్లిక్ చేయకండి. పర్సనల్ డేటాను దొంగిలిస్తారు. పాస్‌వర్డ్‌ను భద్రంగా ఉంచుకోండి. వాటిని ఎవరితోనూ పంచుకోవద్దు. ఎప్పటి కప్పుడు మీ పాస్వర్డ్‌ను మారుస్తూ ఉండాలి. యువత పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్లు, ఇంటర్నెట్, మెసేజింగ్ ప్లాట్ ఫామ్లు మొదలైన ఇతర ప్రకటనలకు ఆకర్షితులవుతుంటారు. వారి ఆశను అవకాశంగా తీసుకొని తక్కువ సమయంలో డబ్బు రెట్టింపు అవుతుందని అధిక జీతం లేదా కమీషన్లు లేదా అధిక రాబడి వస్తుందని వాగ్దానం చేస్తారు. ప్రకటనలు, ఎస్ఎంఎస్‌ల ద్వారా సాధారణంగా ఒక లింక్ ఉంటుంది. ఇది నేరుగా టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపులో చేరమని వారిని అడుగుతారు. పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరిట విదేశీ నెంబర్ల నుండి వచ్చే మోసపూరిత వాట్సప్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

మోసపోతే ఇలా చేయండి..

సైబర్ నేరగాల వల్ల మోసపోయినట్లు గుర్తిస్తే బాధితులు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. https://cyber crime.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫైల్ ఎ కంప్లైంట్ ఆప్షన్‌ను ఎంచుకుని ఫిర్యాదు చేయవచ్చు. అందులో మోసపోయిన వివరాలు, డబ్బు కట్ అయిన ఖాతా వివరాలు, నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను సమర్పించాలి. లేదా సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

కర్ణాటక మద్యం తరలిస్తే చర్యలు

- ఎస్పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కోసిగి

కర్ణాటక మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. బుధవారం కోసిగి పోలీసు స్టేషన్‌ను ఎస్పి తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక సరిహద్దు స్టేషన్‌కు దగ్గర ఉండడంతో కర్ణాటక మద్యం అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి దుకాణదారుడూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాత రికార్డులను తనిఖీ చేసినట్లు తెలిపారు. రాబోయే రేణుక ఎల్లమాంబ జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని శాంతి భద్రతలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు, సిఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ఎస్పీ విక్రాంత్ పాటిల్

మంత్రాలయం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ దర్శించుకున్నారు. ఆలయం చేరుకున్న ఎస్‌పికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి స్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌తో పాటు మాధవరం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు, ఎస్ఐ శివాంజల్, స్పెషల్ బ్రాంచి ఎస్ఐ వేణుగోపాల్ రాజ్, పోలీసు రాఘవేంద్ర ఉన్నారు.

డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టర్

క్లస్టర్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు వైస్ ఛాన్సలర్ ఆర్‌డివిఆర్ సాయి గోపాల్ బుధవారం విడుదల చేశారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కే నాగరాజ్ శెట్టి మాట్లాడుతూ ఈ పరీక్షలు డిసెంబర్‌లో నిర్వహించామని, మొత్తం 872 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 415 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 48 శాతం మంది యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. రివాల్యుయేషన్‌కు అప్లై చేసుకునే విద్యార్థులు ఈ నెల 21వ తేదీ లోపల చేసుకోవాలన్నారు. సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.బాలసుబ్రమణ్యం, డాక్టర్ విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ రమణయ్య పాల్గొన్నారు.

'ఆయుష్మాన్'పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శనతో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్‌లు మాట్లాడుతూ ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాలకు వెంకటరమణ కాలనీలో పర్మిషన్ తీసుకొని అక్రమంగా గణేష్ నగర్‌లోని సోమిశెట్టి కాలనీలో నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వాటికంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ కాలేజీ అకౌంట్‌లో వేస్తామని చెప్పిన దానికి విరుద్ధంగా విద్యార్థులే కట్టాలని అడ్డగోలుగా విద్యార్థులను వేధించి వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థి తాజుద్దీన్ 70 వేల రూపాయల ఫీజు కట్టినప్పటికీ రెండవ సంవత్సరం పరీక్షలు రాయనివ్వకుండా బయటికి గెంటి వేశారని, ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే దశలవారీగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడ తామని, అవసరమైతే అక్రమంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాష, ఉపాధ్యక్షులు వీరేష్, మహేష్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అబుబాకర్, నాయకులు పృధ్వి, యోగి, ఎస్ఎఫ్ఐ టెక్నికల్ స్టూడెంట్స్ నెట్వర్క్ జిల్లా కన్వీనర్ అమర్, కో కన్వీనర్ మనోహర్, శంకర్, రజాక్, తరుణ్, మహబూబ్, సమీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనతో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడి ఉమాదేవి

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ పట్టణంలోని రైతు బజార్‌లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడి ఉమాదేవి పేర్కొన్నారు. రూ.30 లక్షలతో నిర్మించిన రైతు బజార్‌ను బుధవారం జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. వ్యాపారస్తులను, ప్రజలను పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈడి రమాదేవి మాట్లాడుతూ రైతు బజార్‌లో అసౌకర్యాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరికరాలు అందజేస్తాం : ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరికరాలను అందజేస్తామని ఫుడ్ ప్రాసెసింగ్ అధికారి ఈడి ఉమాదేవి పేర్కొన్నారు. పత్తికొండ పట్టణం లోని స్త్రీ శక్తి భవనంలో పొదుపు మహిళలకు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంలో అవ కాశాలు, ప్రోత్సాహకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈడి మాట్లాడుతూ పొదుపు మహిళలకు బేకరీ, నూనె తయారీ, పాలకోవా, చిరుధాన్యాల మిషన్లను 35 శాతం సబ్సిడీతో ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడి వరలక్ష్మి, ఏడి సత్య నారాయణ మూర్తి, ఏడిఏ మోహన్ విజయ్ కుమార్, ఏబిఎం చక్రధర్, డిపిఎం నరసమ్మ, మార్కెట్ సెక్రెటరీ కార్నాలిస్, హార్టికల్చర్ అధికారి దస్తగిరి, ఎఓ వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈడి ఉమాదేవి

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

- 14 ఆందోళన : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు నిర్వహించే విడతల వారి ఆందోళనలో భాగంగా ఈ నెల 14న భాగ్యనగర్‌లో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం దగ్గర ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో జరిగిన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఇతర మూడు బ్యాంకులను కలిపి ఆర్‌బిఐ ఒకే బ్యాంకుగా మార్చిందని, అయితే ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అది సరైనది కాదన్నారు. ఆర్‌బిఐ సూచించిన సూచనల ప్రకారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండడానికి అన్ని రకాల అర్హతలు ఉన్నాయని తెలిపారు. మిగిలిన బ్యాంకుల మొత్తం రిజర్వుల కంటే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రిజర్వులు రూ.1400 కోట్లు ఎక్కువగా ఉందని తెలిపారు. అన్ని బ్యాంకుల మొత్తం కస్టమర్ల కంటే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కస్టమర్లు ఎక్కువమంది ఉన్నారని, అలాగే బ్రాంచీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉందని చెప్పారు. కడపలో సొంత భవనమే ఉండడం కాకుండా అన్ని జిల్లాలలోనూ సొంత భవనాలు ఉన్నాయని, ఏటిఎంలు కూడా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కావున ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలని డిమాండ్ చేశారు. దీని కోసం సిఐటియు విడతల వారి ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, సాయిబాబా, జిల్లా కార్యదర్శులు విజయ్, ప్రభాకర్, జే.నాగేశ్వరరావు, నారాయణస్వామి, ఉమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజిబాబు



మాట్లాడుతున్న నాయకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

- ఎపిఇఇ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తామని ఎపిఇఇ యూనియన్-1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కృష్ణయ్య తెలిపారు. బుధవారం కర్నూలు ఎస్ఇ కార్యాలయం యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... యూనియన్ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిందని, సంక్షేమం కోసం కృషి చేసిందని తెలిపారు. ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 75 సంవత్సరాల వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏ రాజకీయ పార్టీకి గానీ అనుబంధం లేకుండా కార్మికుల శ్రేయస్సు పరమావధిగా ఎన్నో ఉద్యమాలు, సత్యాగ్రహాలు చేసి ఎంతో మంది కార్మికులకు అండగా నిలిచిందన్నారు. నేడు విద్యుత్ రంగంలో అనేక సమస్యలు కొట్టు మిట్టాడుతున్నాయని, వాటిని ఎదుర్కొని కార్మికుల హక్కులు, సంక్షేమం సాధించడమే ఎజెండాగా పెట్టుకుని పని చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఏపీఎస్ఈబి రూల్స్‌ను వర్తింపజేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు, కార్మికులకు అపరిమిత హెల్త్ పాలసీ తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు ఉత్పత్తి పంపిణీ సరఫరాలలో స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు వై.భాస్కరరావు, ఎస్.సతీష్ కుమార్, సిఎం.ప్రసాద్, డి.హుస్సేనయ్య, విజయేంద్ర చారి, మహేశ్వర్ రెడ్డి, తిరుమలయ్య పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- ఎంపిడిఒ సుహాసినమ్మ

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్యం అందించాలని ఎంపిడిఒ సుహాసినమ్మ తెలిపారు. బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధిపై కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ... ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజూ శానిటైజేషన్ చేయించాలని తెలిపారు. పలు అభివృద్ధి పనులపై కమిటీ సభ్యులతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి కమిటీ సభ్యులు తిరుమలేష్ గౌడ్, ఇఒఆర్‌డి రవి కిషోర్, ఇఒ లక్ష్మీనాథ్, డాక్టర్ సాహిత్య, మధుసూదన్ రెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.

'కేశవరెడ్డి' బాధితులను ఆదుకోవాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పిల్లల చదువుల కోసం కేశవరెడ్డి స్కూల్ యాజమాన్యం దగ్గర ఒక్కోరు రూ. లక్షల్లో డిపాజిట్లు వసూలు చేశారని, బాధితులను ఆదుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి కోరారు. బుధవారం నగరంలోని వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో కేశవరెడ్డి బాధితులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా బాధితుల కష్టాల గురించి కేశవరెడ్డితో పాటు ఏ అధికారి పట్టించుకోవడం లేదన్నారు. కొందరు ఆర్థిక ఇబ్బందులతో, అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. వడ్డీలు చెల్లించలేక పస్తులుండే పరిస్థితి ఏర్పడిందన్నారు. డోన్‌కు చెందిన రామసుబ్బారెడ్డి అప్పుల బాధ భరించలేక ఆయన కుటుంబంలో ఒకరు మృతి చెందారని చెప్పారు. బాధితులకు న్యాయం చేసి ఫిక్స్ డిపాజిట్లు కేశవరెడ్డి యాజమాన్యం నుంచి అందజేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐడి కార్యాలయానికి బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. పిపిఎస్ఎస్ కార్యకర్తలు మహ్మద్ యూనుస్, షేక్ అన్వర్ బాష, కేశవరెడ్డి బాధితులు పాల్గొన్నారు.




కేశవరెడ్డి పాఠశాల ఎదుట బాధితుల నిరసన

చౌడేశ్వరి ఆలయం 14 షాపులు సీజ్

- షాపులకు అద్దెలు వసూలు చేసుకుంటున్న 14 మంది దాతలు
- కార్యనిర్వాహక అధికారి గురు రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు శ్రీచౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికి చెందిన 33 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించిన 14 షాపులను దేవదాయ శాఖ ఇఒ గురురెడ్డి బుధవారం సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ... 2022లో 14 మంది దాతలు, ఛైర్మన్ వెంకటేశ్వర్లు ఆలయ పరిధిలో ఉన్న ఖాళీ ప్రదేశంలో సొంత నిధులతో ఆలయ అభివృద్ధి నిమిత్తం దేవదాయ శాఖ నిబంధనల మేరకు షాపులు నిర్మిస్తామని కమిషనర్ నుంచి ఉత్తర్వులు పొందారని తెలిపారు. గతేడాది షాపుల నిర్మాణం చెప్పట్టారని, నిర్మాణం తర్వాత దేవదాయ శాఖకు స్వాధీన పరచకుండా కాలయాపన చేశారని చెప్పారు. మరోవైపు దేవదాయ శాఖ నిబంధనలను ఉల్లంఘించి ఆ షాపులను చిరు వ్యాపారులకు అద్దెలకు ఇస్తూ వారి నుంచి అడ్వాన్స్‌లు, అద్దెలు వసూలు చేసుకున్నారని తెలిపారు. గుర్తించిన దేవదాయ శాఖ అధికారులు కోర్టును ఆశ్రయించారని, కోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో 14 షాపులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు షాపులను ఈనెల 14న బహిరంగ వేలం ద్వారా ప్రజలకు ఇస్తామని తెలిపారు.



ఆలయం ఆర్చి నుంచి దాతలు నిర్మించిన దుకాణాలు

'ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు'

ప్రజాశక్తి - సిబెళగల్

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎంపిడిఒ రాణెమ్మ తెలిపారు. బుధవారం కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలానికి ప్రస్తుతం 143 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని, త్వరగా ఉపాధి కింద పనులు పూర్తి చేసుకొని ఇళ్ల ముందు మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చూసుకోవాలని తెలిపారు. బీసీ కార్పొరేషన్ కింద రుణాలు పొందేందుకు ఈనెల 15 వరకు ప్రభుత్వం గడువు పెంచిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేదిక్ మ్యాథ్స్‌లో 'విశ్వవాణి' ప్రతిభ

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

పట్టణంలోని న్యూ విశ్వవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థి కార్తీక్ రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈనెల 9న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో కార్తీక్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వేదిక్ మ్యాథ్స్‌లో మెళకువలతో తక్కువ సమయంలో ఈ ప్రతిభను చాటడంతో మూడో స్థానాన్ని నిర్వాహకులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో విశ్వవాణి స్కూల్ మేనేజ్మెంట్ ఖలీల్, గిడ్డయ్య, శ్రీనివాసులు కార్తీక్‌ను అభినందించారు. కార్తీక్ వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో మూడో స్థానంలో రాణించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులు రాబియాను ప్రశంసించారు. ఉపాధ్యాయులు కల్పన, భారతి, రెహనా, మహేశ్వరి, ఈశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లేబర్ అధికారులు

అసంఘటిత కార్మికులకు
ఉచితంగా ఈ-శ్రమ్ నమోదు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో ఓల్డ్ సిటీ సిఐటియు కార్యాలయంలో సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ నమోదును బుధవారం ఉచితంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లేబర్ అధికారులు కె.హేమాద్రి, టి.శ్రీలక్ష్మి, సహాయ అధికారులు, బీడీ యూనియన్ అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, చిన్న వ్యాపారుల సంఘం నాయకులు ఎస్ఎమ్‌డి.షరీఫ్ హాజరయి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డు ఉంటే ప్రభుత్వ సామాజిక, భద్రత పథకాలు అందుతాయని తెలిపారు. వలస కార్మికులకు ఎక్కడున్నా గుర్తించి వారికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. నమోదు చేసుకోవడానికి 16 నుంచి 59 ఏళ్ల వరకు వయస్సు ఉండాలని తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన వారికి ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు ఉచితంగా లభిస్తుందని చెప్పారు. షుకుర్, మహబూబ్, నయీమ్, ఇంతియాజ్, ఇలియాస్, నూర్ పాల్గొన్నారు.

త్వరలో 60 రోజుల సమ్మర్ క్రాష్ కోర్సు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలో నందికొట్కూరు రోడ్ వైపు సనత్ నగర్ స్పందన కాంప్లెక్స్‌లో ఉన్న సపియంట్ సైనిక్ స్కూల్ అకాడమీలో 60 రోజులు సమ్మర్ క్రాష్ కోర్సును త్వరలో ప్రారంభించనున్నట్లు స్టీఫెన్ తెలిపారు. మాట్లాడుతూ.. త్వరలో కోర్సు ప్రారంభం కానుందని తెలిపారు. ఆ కోర్సులో భాగంగా సైనిక, నవోదయ, ఆర్ఎంఎస్ ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇస్తామన్నారు. తమ వద్ద నాన్ లోకల్ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం, ఆరోగ్యకరమైన భోజన వసతులు కూడా ఉన్నాయని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే భావనాత్మక తరగతులు, ఫలితాల ఆధారిత శిక్షణ ఉంటుదన్నారు. స్మార్ట్ గాడ్జెట్‌లను ఉపయోగించి సబ్జెక్టులలోని ప్రతి భావనను పూర్తిగా బోధించడం తమ ప్రత్యేకతని తెలిపారు. సరళీకత అభ్యాస పద్ధతులను ఉపయోగించి ప్రతి విషయంపై రోజువారీ తరగతులు ఉంటాయన్నారు. ప్రతి అంశంపై రెండు వారపు పరీక్షలు, గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. మరింత సమాచారం కోసం 8919759871, 9652815851 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.




విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

జెఇఇ మెయిన్ ఫలితాల్లో 'నారాయణ' సత్తా

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసి జెఇఇ మెయిన్ ఫలితాల్లో కర్నూలు నారాయణ విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించి సత్తా చాటారని కర్నూలు నారాయణ కోర్ డీన్ పి.లింగేశ్వర రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. నారాయణ కళాశాల నుంచి టి.మిథున్ సాయి కుమార్ 99.91 పర్సంటైల్, కె.జీవన్ కుమారణ 99.85, కె.చరణ్ కుమార్ 99.84, ఎన్.శివ ధనుష్ 99.48, కె.సాయి శ్రుతి 99.43, ఎమ్‌డి.ఖాజా ఫయోజన్ అహ్మద్ 99.43, కె.సాయి భాస్కర్ 99.21, డి.ధరణి 99.09, ఎన్.హర్షిత 98.87, ఎ.ఫణిశ్రీ సౌగంధ్ 98.81, కె.తన్మయి రెడ్డి 98.49, జె.ప్రణీత్ కుమార్ 98.38, టి.రాహుల్ అరురూప్ 98.38, పి.దేవి శ్రీచరణ్ 98.24, ఆర్.యోగేష్ కుమార్ 98.01, షేక్ మహ్మద్ జైద్ అహ్మద్ 97.76, ఎస్.సాయి మానస్ గౌడ్ 97.69, ఎస్.ఖరాన్ను 97.54, డి.మధు చైతన్య రెడ్డి 97.53 పర్సంటైల్ సాధించారు. అలాగే 99 పర్సంటైల్‌పైన 8 మంది, 98 పర్సంటైల్ పైన 15 మంది, 97 పర్సంటైల్ పైన 19 మంది, 96 పర్సంటైల్‌పైన 25 మంది, 95 పర్సంటైల్ పైన 28 మంది, 90 పర్సంటైల్ పైన 47 మంది విద్యార్థులు అర్హత సాధించారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందిచారు. కళాశాల డిజిఎమ్ టి.గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ ఎన్.సారిక, విజయ మోహన్, పి.సుజాత పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అధ్యాపక బృందం, విద్యార్థులు



బీసీ బాలల వసతి గృహం ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



నూతన కమిటీ సభ్యులతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి- గోనెగండ్ల

గోనెగండ్లలో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ కోరారు. బుధవారం ఎపి మోడల్ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని ఎప్పటికప్పుడు విద్యార్థి లోకానికి తెలియజేస్తూ విద్యార్థులకు నష్టం కలిగించే విధానాలకు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలు చేస్తోందని తెలిపారు. నిరంతరం పేద విద్యార్థుల రక్షణ కోసం నిలబడి వారికి అండగా పోరాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రయివేటీకరిస్తూ కార్పొరేట్లకు విద్యారంగాన్ని అప్పజెప్పడం ద్వారా పేదలకు విద్య అందని ద్రాక్ష లాగా మారిందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. గోనెగండ్ల మండల అధ్యక్షులుగా రంగస్వామి, కార్యదర్శిగా పవన్ తేజ మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు కరుణాకర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినయ్, ఓంకార్, రియాజ్, శీను పాల్గొన్నారు.

మాజీ సర్పంచి తల్లి మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - దేవనకొండ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

మండలంలోని తెర్నేకల్ మాజీ సర్పంచి బాటమీద రాజన్న తల్లి మహానందమ్మ మృతదేహానికి బుధవారం ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి నివాళులర్పించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, ఆయన సోదరుడు శేషాద్రి రెడ్డి, సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్, వైసిపి నాయకులు సత్యరాజు, పులి నరేష్, నాగన్న, ఏసేపు నివాళులర్పించారు. సిపిఎం, హమాలీ యూనియన్ నాయకులు రాముడు, బజారి, పరమేష్, లక్ష్మీ రెడ్డి, సుధాకర్, రవీంద్రబాబు నివాళులర్పించారు.

గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

- డిఎల్‌పిఒ వీరభద్రప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి


గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ వీరభద్రప్ప

గ్రామీణ ప్రాంతాలు కూడా అభివృద్ధి బాటలో పయనించాలంటే ఆ గ్రామాల ప్రజల సహకారం ఎంతో అవసరమని డిఎల్‌పిఒ వీరభద్రప్ప తెలిపారు. బుధవారం ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో చిప్పగిరితో పాటు నేమకల్లు, నగరడోన గ్రామాలలో పర్యటించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను పరిశీలించారు. నేమకల్లు గ్రామంలో ఉన్న ప్రధాన రహదారిలో వేసుకున్న చిరు వ్యాపారుల బంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బంకులన్నీ ఒక క్రమబద్ధీకరణలో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పంచాయతీలకు ఆదాయాలు వచ్చేలా చూసుకునే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఈనెల 15న నిర్వహించే ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాల ప్రారంభోత్సవం ఒక పండగలా నిర్వహించాలని అధికారులను కోరారు. వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొత్త పైపులైన్ వేసేటప్పుడు సర్పంచుల సహకారం తీసుకుని వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మొక్కలను నాటారు. పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, ప్రమీల, నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీయాదవేంద్ర తీర్థుల ఆరాధన

ప్రజాశక్తి - మంత్రాలయం


పూజలు చేస్తున్న పీఠాధిపతులు

శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శ్రీయాదవేంద్ర తీర్థుల ఆరాధనను ఘనంగా నిర్వహించారు. బుధవారం యాదవేంద్ర తీర్థుల ఆరాధన సందర్భంగా బెళగల్ మండలం ముడమాల గ్రామంలో ఉన్న ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదవేంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు.

అమలుకు నోచని షెడ్యూల్

- ముందుకు సాగని ఉద్యోగోన్నతుల ప్రక్రియ
- ఇబ్బందుల్లో లాంగ్వేజ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించి గతేడాది అక్టోబర్‌లో కూటమి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. షెడ్యూల్ అమలుకు నోచుకోవడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. మున్సిపల్ పాఠశాలల్లోని లాంగ్వేజ్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా అమలు చేయకుండా కొందరు అధికారులు జాప్యం చేయడం పట్ల ఉపాధ్యాయులు మండి పడుతున్నారు.

జిల్లాలో నేటికీ మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి కాలేదు. ఉమ్మడి జిల్లాలోని నంద్యాల, ఆదోని పురపాలక సంఘాల యూనిట్‌గా ఉద్యోగోన్నతులు జరగాలని ప్రభుత్వం పేర్కొంది. అత్యంత అనుభవం గల సుదీర్ఘ కాలం జిల్లా కార్యాలయంలోనే ఉన్న విద్యాశాఖ అధికారులు ఉన్నప్పటికీ ఎందుకో నేటికీ ఖాళీల సంఖ్యను కూడా బహిరంగంగా ప్రకటించడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కర్నూలు కార్పొరేషన్‌లో పని చేసే ఉపాధ్యాయులకు లాంగ్వేజ్ పాఠశాల సహాయకుల పోస్టులకు ఉద్యోగోన్నతి ప్రక్రియ పూర్తి చేశారు. నంద్యాల, ఆదోని పురపాలక సంఘాల యూనిట్ విషయంలో లేనిపోని సందేహాలు వ్యక్తం చేస్తూ.. కొందరు అధికారులు సాగదీస్తున్నారని మండిపడుతున్నారు. డిఇఒ నిత్యం ఏదో ఒక పనిలో బిజీగా ఉండడంతో కొందరు అధికారులు 'ఆడిందే ఆట.. పాడిందే పాటగా' కార్యాలయంలో ఉంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నిర్లక్ష్యం వీడి ప్రక్రియను మొదలు పెట్టాలని ఉద్యోగోన్నతి పొందే మున్సిపల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ పరిధిలోకి వచ్చాక మున్సిపల్ ఉపాధ్యాయులను ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులుగా భావిస్తున్నట్లుందని ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయులకు భారీ సంఖ్యలో ఉద్యోగోన్నతులు నిర్వహించిన విద్యా శాఖ అధికారులు తమ వంతు రాగానే చేతులెత్తేసే విధంగా వ్యవహరించడం తగదని వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్షపాతం లేకుండా వ్యవహరించాల్సిన అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు కూడా తగిన విధంగా స్పందించడం లేదని ఆశావహులు పేర్కొంటున్నారు. అగ్రినెస్ట్ పోస్టుల్లో జీతం తీసుకుంటున్న కొందరు మున్సిపల్ ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు పరోక్షంగా వత్తాసు పలుకుతున్నంత కాలం ఈ ఉద్యోగోన్నతుల ప్రక్రియ జిల్లాలో ముగిసే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు. గతంలో కొందరు మున్సిపల్ ఉపాధ్యాయులు భాషేతర పాఠశాల సహాయకుల పోస్టుల్లో ఉంటూ అగ్రినెస్ట్ పోస్టు కింద జీతం తీసుకున్నందువల్ల ఆలస్యం కాగా నేడు లాంగ్వేజ్ పాఠశాల సహాయకుల పోస్టుల్లో నంద్యాల మున్సిపాలిటీలో ముగ్గురు, ఆదోని మున్సిపాలిటీలో ముగ్గురు చొప్పున అగ్రినెస్ట్‌గా జీతం తీసుకుంటున్నారని పేర్కొంటున్నారు. అలాంటి మున్సిపల్ ఉపాధ్యాయులకు విద్యాశాఖలోని కొందరు అధికారులు వెన్నుదన్నుగా ఉండడం వల్లే ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదని చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మున్సిపల్ విద్య వ్యవహారంపై సమయం కేటాయించి, జిల్లాలో మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏళ్ల తరబడి నలుగుతున్న సమస్య

- సురేష్ కుమార్, మున్సిపల్ ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల, ఆదోని మున్సిపాలిటీల్లో దాదాపు ఆరుగురు ఉపాధ్యాయులు అగ్రినెస్ట్ పోస్టుల్లో జీతం తీసుకుంటున్నారు. అప్పట్లో మున్సిపల్ కమిషనర్ డిడిఒగా ఉంటూ అందరికీ గంపగుత్తగా జీతం మంజూరు చేసేవారు. విద్యాశాఖ కిందికి వచ్చాక ప్రధానోపాధ్యాయులు డిడిఒలుగా ఉండడం, యాజమాన్యం మార్పిడి సమయంలో జరిగిన తప్పిదాల వల్ల నేటికీ ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకొని అర్హులకు న్యాయం చేయాలి. రాబోయే బదిలీల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- దేవనకొండ



దేవనకొండ తహశీల్దార్‌గా ప్రసాద్ రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో హొళగుంద తహశీల్దార్‌గా, ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. విఆర్‌ఒలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆలూరు



ఆలూరు ఎస్‌ఎఫ్‌ఐ 8వ మండల మహాసభ సందర్భంగా బుధవారం నూతన కమిటీని 17 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బసవరాజు, ఉమేష్, ఉపాధ్యక్షులుగా బోటయ్య, మణి, మల్లికార్జున, సహాయ కార్యదర్శులుగా ఉపేంద్ర, డాకే నాయక్, రవినాయక్, 9 మందిని కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బీసీ కార్పొరేషన్ దరఖాస్తులకు ముగిసిన గడువు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువు ముగిసిందని ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి 12న ముగిసిందని తెలిపారు. 50 యూనిట్లకు గాను మొత్తం దాదాపు 480 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించేది దరఖాస్తులు చేసుకున్న అందరికీ సమాచారం ఇస్తామని తెలిపారు. నిర్ణయించిన తేదీల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐజి ఇక్బాల్

విద్యను మించిన వెలుతురు మరోటి లేదు

- రిటైర్డ్ ఐజి మహ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి - కోసిగి

విద్యను మించిన వెలుతురు మరోటి లేదని, విద్య అనేది సమాజం ఆత్మ అని, విద్య ప్రధాన లక్ష్యం ఒకరిని ఆలోచింపజేయటమని, ఎంత ఎక్కువ చదివితే అంత విషయాలను తెలుసుకోవచ్చని రిటైర్డ్ ఐజి మహ్మద్ ఇక్బాల్ తెలిపారు. బుధవారం స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్, బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్పీ విక్రాంత్ బాటిల్‌తో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థీ కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రులను, గురువులను గౌరవించి గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా.. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నతంగా చదివి ఎదగాలని తెలిపారు. మారుమూల పల్లెల్లో చదివిన వారు నేడు ఐఎఎస్, ఐపిఎస్ స్థాయిలో ఉన్నారని, ఇందుకు ఉదాహరణ ఇక్బాల్ అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని జిల్లా అధికారులతో పరిష్కరించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పూర్వపు విద్యార్థులు ఈరన్న, ఉస్మాన్, రామకృష్ణ పాల్గొన్నారు.

'వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వాలంటీర్లను విధుల్లోకి తీసుకుని ఉపాధి కల్పించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రాముడు, వాలంటీరు యూనియన్ గౌరవాధ్యక్షులు సురేష్, అధ్యక్షులు శిరీష డిమాండ్ చేశారు. బుధవారం జెసి డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాలంటీర్లను కొనసాగిస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, 8 నెలలు కావస్తున్నా వాలంటీర్ల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడడం లేదని తెలిపారు. వాలంటీర్ల ఉపాధి పోగొట్టి వారికి జీవనాధారం లేకుండా చేశారన్నారు. వాలంటీరు వ్యవస్థను కొనసాగించి పెండింగ్‌లో ఉన్న 8 నెలలు వేతనం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా వాలంటీర్లను చైతన్యం చేసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వాలంటీరు యూనియన్ నాయకులు మధు, రవి, గోపి, తిమ్మన్న పాల్గొన్నారు.

వైభవంగా కౌలుట్ల చెన్నకేశవ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చరణలతో ఆలయ కార్యనిర్వహణ అధికారి వీరయ్య, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో రథోత్సవం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వైకుంఠం శివ ప్రసాద్, తుగ్గలి నాగేంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్థానిక సిఐ వంశీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, కాకర్ల శాంతికుమార్, రాజశేఖర్ గౌడ్, మల్లెపల్లి రంగడు పాల్గొన్నారు.


రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తాదులు

శివారు ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేయాలి

- హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ ఉండేలా చూడాలని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సురేష్ కుమార్ కోరారు. బుధవారం ఆదోని వన్‌టౌన్ సిఐ శ్రీరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్వతాపురం, రాయనగర్, పైకొట్టాల, దేవినగర్, శుక్రవారం పేట, ఇస్వి రోడ్డు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆయా ప్రాంతాల వాసులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. గత ఆరు నెలల నుంచి అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు సిఐ చొరవతో తగ్గు ముఖం పట్టాయని చెప్పారు. శివారు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చట్టం గురించి వివరించాలని కోరారు. సిఐ సానుకూలంగా స్పందించారు. హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ రాజశేఖర్, మెంబర్స్ నాగరాజు, మహేష్, కిరణ్, శ్రీధర్ గౌడు, ఇస్వి ఈరన్న, రాఘవేంద్ర ఉన్నారు.

అనుభవాల ద్వారానే లాభాలు

- వైష్ణవి విద్యా సంస్థల బిజినెస్ మీట్‌లో వక్తలు, బహుమతి గ్రహీతల పిలుపు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అనుభవాల ద్వారానే వ్యాపారంలో లాభాలు గడించవచ్చని వక్తలు, ముఖ్య అతిథులు వైష్ణవి విద్యాసంస్థల ఛైర్మన్ జీడి లింగప్ప, కరస్పాండెంట్ సత్య సిరి, శిల్పా నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ శిల్ప, వైష్ణవి అకాడమీ ఇన్‌ఛార్జీ జి.విష్ణు ప్రభు, డైరెక్టర్లు ఎస్‌బిఐ రిటైర్డ్ మేనేజర్ గంగన్న, ఫ్యాషన్ డిజైనర్ సాయి కృతి, బహుమతి గ్రహీతలు కె.సంధ్య, జి.రామ్మోహన్ శెట్టి, జై వీరేష్, ఎస్.మల్లేశ్వరి దేవి, ఎస్.సుభాన్, బి.బాలాజీ తెలిపారు. బుధవారం మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఎంబిఎ, బిబిఎ విద్యార్థులు పట్టణంలోని వ్యాపారవేత్తలను వారి అనుభవాలు, వ్యాపారం మెళకువలను తీసుకొని అవార్డు గ్రహీతలను ఎంపిక చేశారు. బహుమతి గ్రహీతలు వ్యాపార మెళకువలను విద్యార్థులకు వివరించారు. 2024 ఉత్తమ వ్యాపారవేత్తలుగా జి.రామ్మోహన్ శెట్టి, జై వీరేష్, మహిళ విభాగంలో కె.సంధ్య, 2025 సంవత్సరానికి గాను బి.బాలాజీ, ఎస్.సుభాన్, మహిళా విభాగంలో ఎస్.మల్లేశ్వరి దేవి పట్టణంలో ఉత్తమ వ్యాపారవేత్తలను ఎంపిక చేసి అవార్డులను అందజేశారు. వైష్ణవి అకాడమీ ఇన్‌ఛార్జీ జి.విష్ణు ప్రభు మాట్లాడుతూ... రాష్ట్రంలో తమ విద్యా సంస్థ మంచి ఫలితాల ద్వారా రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకు రాగలదన్నారు. బిజినెస్ మీటింగ్‌కు సంబంధించి వైష్ణవి ఎంబిఎ, డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్ కుమారస్వామి, మధుబాబు, మునెప్ప తమ కళాశాల ప్రత్యేకతలు తెలియజేశారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు



వ్యాపార వేత్తలను ప్రకటిస్తున్న అతిథులు

కెవిఆర్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఐఎల్‌ఎమ్ బెంగళూరు వారు బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు 200 మంది హాజరయ్యారని ముఖ్య అతిథిగా విచ్చేసిన క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 26 మంది ఎంపికయ్యారు. కెవిఆర్ కళాశాల విద్యార్థులు 8 మంది, సిల్వర్ జూబ్లీ విద్యార్థి ఒకరు, ప్రభుత్వ పురుషుల కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఉండటం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌ఎం.బాష, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ జిఎం.బాష, జెకెసి మెంటర్ కె.ఈశ్వర్, ఐఎల్‌ఎమ్ హెచ్‌ఆర్ గౌస్ బాష పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : డిసిసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిసిసి అధ్యక్షులు పి.మురళీ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆరు నెలలు గడిచినా బీసీలు న్యాయం చేయలేదని విమర్శించారు. పెన్షన్లను రీ వెరిఫికేషన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో డాక్టర్లు పరీక్షలు చేసే సర్టిఫికెట్ ఇచ్చి ఉంటారని, మరి వారిని ప్రభుత్వాస్పత్రికి పిలిచి ఇబ్బందులకు గురి చేయవద్దని తెలిపారు. అనేక కార్పొరేషన్లలోనూ నిధులను కేటాయించలేదన్నారు. ఓబీసీ సెల్ జిల్లా ఛైర్మన్ సాంబశివుడు, ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ ఎన్‌సి.బజారన్న, మైనార్టీ డిపార్ట్‌మెంట్ జిల్లా ఛైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

ముగిసిన బీరప్ప దేవర ఉత్సవాలు


ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో బీరప్ప దేవర ఉత్సవాలు బుధవారం పెద్దలు, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ముగిశాయి. ఆలయంలో గత మూడు రోజులుగా బీర లింగేశ్వర దేవర ఉత్సవాలు సాగాయి. బుధవారం చివరి రోజున బీరప్ప స్వామి, కమలమ్మ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా పల్లకి సేవా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఎస్సీ కులగణన జాబితా నుంచి
మాదాసి/మాదారి కురువలను తొలగించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాల బోర్డుల్లో ప్రదర్శించిన జాబితా నుంచి మాదాసి/మాదారి కురువ పేరుతో నమోదైన బీసీ 'బి' కురుబ పేర్లను తొలగించి ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలని కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు సుమాల ఆంథోని, సుమాల రాజు, ఎం.గుండప్ప డిమాండ్ చేశారు. బుధవారం జెసి డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఆదేశాల మేరకు ఎస్సీ కుల గణన జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ జాబితాలో ఈ ప్రాంతంలో నివాసం లేని బీసీ 'బి' జాబితాలో ఉన్న కురుబలు నమోదు చేసుకోవడం విచారకరమని, దీన్ని ఎస్సీ ఉపకులాలు వ్యతిరేకించి అభ్యంతరం తెలపాలని కోరారు. గతంలో ఉప కులాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ జూన్ 17, 2020న 16 ఉప కులాలను తొలగించాలని, మాదాసి/మాదారి కురువలు రాష్ట్రంలో లేరని నివేదికను సమర్పించినట్లు తెలిపారు. పాలకులు ఓట్ల కోసం మాదాసి కురువలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని 2022లో జిఒ 53 జారీ చేయడం దళితులను మోసగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మాదాసి/మాదారి కురువలు ఉంటే కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరమూ లేదని, గ్రామాల్లో లేని కులాలకు కుల ధ్రువీకరణ పత్రం ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. ఎస్సీలో ఉన్న ఉప కులాలకు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలంటే తగాదాలు సృష్టించి జాప్యం చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. లేని కులాలకు ఇవ్వడం సామాజిక న్యాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఎస్సీ 59 ఉపకులాల్లోని విద్యావంతులు, నాయకులు చొరవ చూపి సచివాలయాల దగ్గర జాబితాలను తీసుకొని మాదాసి/మాదారి కురువలపై అభ్యంతరం తెలిపి అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కనుల పండువగా 'సిద్ధరూఢ' రథోత్సవం

ప్రజాశక్తి - కోసిగి

గ్రామంలో వెలసిన శ్రీసద్గురు సిద్ధరూఢ మహాస్వామి రథోత్సవం బుధవారం కనుల పండువగా సాగింది. గత మూడు రోజులుగా శ్రీసద్గురు ఆరుడజ్యోతి శాంతాశ్రమంలో శ్రీసద్గురు సిద్ధరూఢ 9వ వార్షికోత్సవ జాతర, జ్ఞాన దాసోహ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు శ్రీసిద్ధరూఢ మహాస్వాముల వారికి అభిషేకం, సహస్ర బిల్వార్చన, మహామంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభినవ సిద్ధరూఢ మహాస్వాములు మాట్లాడారు. అనంతరం హుబ్బిలి పీఠాధిపతి శ్రీఅభినవ సిద్ధరూఢ మహాస్వాముల వారి ఆశీస్సుల కోసం భక్తులు క్యూ కట్టారు. ఆరుడజ్యోతి శాంతాశ్రమం కమిటీ పెద్దల ఆధ్వర్యంలో శాంతాశ్రమం నుంచి శ్రీసిద్ధరూఢ మహాస్వాముల రథోత్సవాన్ని డప్పు, వాయిద్యాలు, మేళ తాళాలు మధ్య లాగారు. వేడుకలను తిలకించేందుకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు శ్రీసిద్ధరూఢ శాంతాశ్రమం కమిటీ సభ్యులు భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రహ్లాద రెడ్డి పాల్గొన్నారు. ఎస్ఐ చంద్ర పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా బసవేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని బాపురం గ్రామంలో వెలసిన ఉద్భవమూర్తి బసవేశ్వర స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బుధవారం ఉదయం గంగిపూజ, నందికోలు, ఆకు పూజ, కుంకుమ పూజ చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని ఊరేగించారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ


రథోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఎంవిఐలు రవీంద్ర కుమార్, నాగార్జున, ప్రిన్సిపల్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. ప్రధాన డ్రెయినేజీ కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పూడికను బుధవారం సర్పంచి అయ్యమ్మ, ఇఒ తిరుమలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు తొలగించారు. సీనియర్ నాయకులు మాణిక్యరాజు పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా డ్రెయినేజీ కాలువలో పూడిక తీత పనులు చేపట్టారని, ప్రజలు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. డ్రెయినేజీలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ సీసాలు, గాజు సీసాలు, వాటర్ బాటిల్ వంటివి వేయరాదని చెప్పారు. డ్రెయినేజీ కాలువలో వేయకుండా కాలనీలోకి పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు వేయాలని ప్రజలను కోరారు. యువ నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

- ఆర్‌టిసి ఇడి చంద్రశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌ఆర్‌టిసిలో పనిచేస్తున్న డ్రైవర్లు మానసిక ప్రశాంతత కలిగి అప్రమత్తంగా వాహనాలను నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక స్టాఫ్ జోనల్ శిక్షణ కళాశాలలో రోడ్డు భద్రత మాస ఉత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు డిపిటిఒ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఆర్‌టిఒ భరత్ చౌహాన్ హాజరై మాట్లాడారు. డ్రైవర్లకు రోడ్డు భద్రత, ముందస్తు ప్రమాదాలను నివారించుటలో తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్,

పర్యావరణాన్ని కాపాడే 'ఆహ్లాద'

- టేక్ వుడ్ కన్న తక్కువ ధరలోనే లభ్యం - అతి తక్కువ మెయింటెనెన్స్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆహ్లాద స్టీల్ డోర్స్ అండ్ విండోస్ పర్యావరణాన్ని కాపాడతాయని సిఇఒ బాబావలీ తెలిపారు. బుధవారం నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్‌లో ఉన్న ఆహ్లాద స్టీల్ డోర్స్ అండ్ విండోస్ సిఇఒ బాబా వలీ మాట్లాడారు. ఇంటికి ప్రధాన ఆకర్షణ ప్రధాన తలుపులని, అందుకోసం ప్రజలు రూ.లక్షలు పోసి టేకు తలుపులు తయారు చేయించుకుంటారని చెప్పారు. వారిని చెదల భయం వెంటాడుతూ ఉంటుందని తెలిపారు. ఇప్పుడు అలాంటి భయం అవసరం లేకుండా అదే లుక్, టేకుతో పోలిస్తే మరింత బలంగా, మరింత భద్రతతో తమ దగ్గర స్టీల్ డోర్స్ లభిస్తాయని తెలిపారు. ఇవి చదలు పట్టడం కానీ, తప్పు పట్టడం జరగవని చెప్పారు. టేకుతో పోలిస్తే ఎక్కువ కాలం మన్నిక వస్తాయని తెలిపారు. స్టీల్ డోర్స్‌తో పాటు తమ దగ్గర స్టీల్ కిటికీలు, స్టీల్ అల్మరాలు, కమర్షియల్ డోర్స్, స్కూల్‌కు సంబంధించిన ఫర్నీచర్ లభిస్తుందని చెప్పారు. తమ కంపెనీ వస్తువులకు పదేళ్ల పాటు గ్యారంటీ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.



'ప్రతి రైతూ గుర్తింపు నమోదు చేసుకోవాలి'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


మాట్లాడుతున్న బాలవర్ధిరాజు

వ్యవసాయ పొలాలు ఉన్న ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఎఒ సి.అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కపటి, పెసలబండ గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు బి.బాలవర్ధిరాజు మాట్లాడారు. విశిష్ట గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలను సులభతరం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతులకు పారదర్శకంగా అందజేయనున్నట్లు తెలిపారు. భూఆధారిత వ్యవసాయ రాయితీ పథకాలైన పిఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, ఆధార్ అనుసంధారిక ఫోన్ నెంబర్, భూమి రికార్డుల వివరాలు, పట్టాదారు పాసుపుస్తకం, 1బి తీసుకొని రైతు సేవా సిబ్బందిని కలిసి రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకరిస్తాం

- సర్పంచి సోదరుడు మారెప్ప


మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

దేవాలయ అభివృద్ధికి సహకరిస్తామని నదిచాగి సర్పంచి మహేష్ సోదరుడు మారెప్ప పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవమ్మ దేవాలయాన్ని ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవాలయం నిర్మాణానికి రూ.5 లక్షల విలువ గల రాయి, సామగ్రి ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు శాంతితో పాటు ప్రశాంతతకు నిలయాలుగా నిలుస్తాయని చెప్పారు. ప్రజల్లో సేవాగుణం పెంపొందించడానికి దేవాలయాలు కీలకమన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

మండలంలోని అమడగుంట్ల, ఎర్రదొడ్డి, అనుగొండ గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. కర్నూల్ డివిజన్ ఎడిఎ ఎన్.సాల్ రెడ్డి, ఎఒ రవి ప్రకాష్ మాట్లాడుతూ... ప్రతి రైతుకు కూడా ప్రభుత్వం రైతు విశిష్ట గుర్తింపు కార్డు 11 అంకెలతో కూడిన పొలం పాస్ బుక్ ఉన్న రైతుకు ఏర్పాటు చేస్తున్నారని, మండలంలోని ప్రతి గ్రామంలోని రైతు రైతు సేవా కేంద్రం దగ్గరకు వెళ్లి కార్డును పొందాలని కోరారు. దీని కోసం రైతు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్‌ని తీసుకుని వెళ్లాల్సి ఉంటుందన్నారు.